# రెక్కల గుఱ్ఱము

మోక్షము తెలియుటకు జ్ఞానశక్తి అవసరమన్నాము. జ్ఞానశక్తి లభించవలయునంటే యోగమాచరించ వలెను. యోగ మనగ! మనస్సు చలించక నిలిచి పోవలయును. మనస్సు చంచలమైనది. అది ఎంతో వేగముగ చలించుచుండును. వాయు వేగమైన, చంచలమైన మనస్సు నిల్పుటకు సాధన అవసరము. ఈ విధముగజేసిన మోక్షము దొరుకునని నక్షత్రమును చంద్రవంకను చూపిన పెద్దలు రెక్కల గుఱ్ఱమును చూపారు. దీనికర్థమేమనగా! గుఱ్ఱము పరుగెత్తునది. అందులోను రెక్కల గుఱ్ఱమనగా వాయు వేగముకంటే ఎక్కువ వేగముగలదని అర్థము. నీలోని మనస్సు ఇలాంటిదని తెల్పు నిమిత్తము రెక్కల గుఱ్ఱమును చూపారు. సాంఖ్య సూత్రము ప్రకారము ఆకాశము ఒకటవ భాగము, గాలి ఒకటవ భాగము కలిసినపుడు తయారైనది మనస్సు. కావున ఆకాశమున గాలిలో ఎగురు రెక్కల గుఱ్ఱమును మనస్సుగ చూపారు. మనస్సు నిలువవలయు నంటే శరీరములోని పంచ జ్ఞానేంద్రియాల యొక్క ఏ విషయము జ్ఞప్తికిరాక నిలిచి పోయినపుడు మనస్సు నిల్చిపోవును. జ్ఞానేంద్రియాల విషయాల మీదనే మనస్సు చలించుచుండును. కావున చంచలమైన మనస్సు నిల్పవలయునంటే ఐదు జ్ఞానేంద్రియాల ధ్యాసలు నిల్చి పోవలయును. కనుక మనస్సును రెక్కల గుఱ్ఱముగజూపి ఈ గుఱ్ఱము నిలిచి పోవలయునంటే ఐదు జ్ఞానేంద్రియాలు నిలిచి పోవలయునని ఐదు వ్రేళ్ల కల హస్తమును గుఱ్ఱమునకు పై భాగమున చూపారు.



**రెక్కల గుఱ్ఱము**

ఐదు వ్రేళ్ళు కల్పిన హస్తము నిలుపుమని హెచ్చరించునట్లు కన్పించుచున్నది. హస్తములోని జ్ఞానేంద్రియ ముల ధ్యాసలు నిల్చిన చంచలమైన మనస్సనెడి రెక్కలగుఱ్ఱము నిలుచునని చూపారు. రెక్కల గుఱ్ఱమైన మనస్సు నిల్చుట వలన జ్ఞానశక్తి పెరుగునని పైన చంద్రవంకను చూపారు. జ్ఞానశక్తి పెరిగిన మోక్షము లభించునని నక్షత్రమును కూడ చూపారు. నక్షత్రము, చంద్రవంక, హస్తము, రెక్కల గుఱ్ఱము అన్ని గుర్తులు ఒక్క చిత్రమునందే చూడవచ్చును. కొన్ని చోట్ల రెక్కల గుఱ్ఱము హస్తము ఒక చిత్రముగ, నక్షత్రము చంద్రవంకలు ఒక చిత్రముగ నున్నవి. అంతరార్థముగ ఎంతో జ్ఞానమిమిడి ఉన్న ఈ చిత్రముల విషయము చాలామందికి తెలియదనే చెప్పవచ్చును. ఆత్మ జ్ఞానమిమిడి ఉన్న చిహ్నములైన ఈ గుర్తులను అందరు గౌరవించవలెను.